క్లుప్తంగా

కిటకిటలాడిన పంచారామ క్షేత్రం


సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి.నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు. ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్ బాబు, సభ్యులు భక్తులకు సేవలందించారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

సామర్లకోట: ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉండాలనే లక్ష్యంతో సోమవారం నుంచి 27వ తేదీ వరకూ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత సోమవారం తెలిపారు. సోమవారం చంద్రంపాలెం, వీకే రాయపురం, పీబీ దేవం, 19న గొంచాల, వీకే రాయపురం, పీబీ దేవం, 20న పనసపాడు, కాపవరం, పీబీ దేవం, 26న పి.వేమవరం, అచ్చంపేట, జి.మేడపాడు, 27న పవర, పి.వేమవరం, వేట్లపాలెం పంచాయతీ కార్యాలయాల వద్ద ఆధార్ శిబిరాలు జరుగుతాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న ఆపద మిత్రల శిక్షణ


సామర్లకోట ఈటీసీలో ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ పరాశరా

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఆపద మిత్రల శిక్షణ 8వ రోజు సోమవారం కొనసాగింది. ఆపద మిత్ర శిక్షణకు హాజరు కాని వారి కోసం ప్రత్యేకంగా 12 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విశాఖ, అనకాపల్లి, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన ఆపద మిత్రలకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈ అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నారు. రెడ్‌క్రాస్ డాక్టర్ పరాశరా విపత్తులు సంభవించిన సమయంలో వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.కిరణ్మయి, ఎన్డీఆర్ఎఫ్ ప్రతినిధి ఎంవీఆర్ అప్పలనాయుడు, ఈటీసీ ఫ్యాకల్టీలు పి.శ్రీనివాస్, కేఆర్ నిహారిక, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

నిషేధ సమయంలో వేటకు వెళ్లరాదు


అమీనాబాదు తీరంలో మత్స్యకారులతో సమావేశం నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు

కొత్తపల్లి: వేట నిషేధ సమయంలో మత్స్యకారులెవ్వరూ సముద్రంలో వేటకు వెళ్లరాదని వాకలపూడి మెరైన్ సీఐ సుమంత్ సూచించారు. అమీనాబాదు తీరప్రాంతంలో సోమవారం మత్స్యకారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ 61 రోజులు సముద్రంలో మత్స్యసంపద వృద్ధి చెందే సమయమన్నారు. ఈ సమయంలో వేట చేయడం వలన మత్స్య సంపదకు పూర్తిగా నష్టం కలుగుతుందన్నారు. వేట నిషేధం అమలుకు మత్స్యకారులు సహకరించాలని కోరారు. సమావేశంలో మత్స్యశాఖ ఏడీ శ్రావణి, మెరైన్ సీఐలు సత్యనారాయణరెడ్డి, అవినాష్ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

పిఠాపురం: న్యాయవాదులకు సీఐడీ అధికారులు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పిఠాపురంలో న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజారావు, భాస్కర్ మాట్లాడుతూ వాక్ స్వాతంత్ర్యానికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తూ బార్ కౌన్సిల్ సభ్యులు ఆలిండియా లాయర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, విజయవాడ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, హైకోర్టు న్యాయవాది జడ శ్రవణకుమార్‌లకు సెక్షన్ 160 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఐడీ అధికారులు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఠాపురం బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు స్వగృహమస్తు!

- టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తి
- లబ్ధిదారుల సొంతం కానున్న గృహాలు
- ఈ నెలాఖరుకు ఫ్లాట్ల పంపిణీ

పిఠాపురంలో టిడ్కో ఇళ్ల వివరాలు

మొత్తం గృహాలు	864
లబ్ధిదారులు	864 మంది
నిర్మాణ వ్యయం	రూ.57 కోట్లు
రిజిస్ట్రేషన్లు పూర్తయినవి	700


పిఠాపురంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలు

పిఠాపురం: పట్టణ పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వారి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) ద్వారా నిర్మించిన గృహాలను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు చేసేందుకు ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు.

28 భవనాల్లో 864 మందికి..

పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో గోర్స రైల్వే గేటు సమీపంలో సర్వే నంబర్లు 496, 498, 547, 121లో అపార్ట్‌మెంట్లు నిర్మించారు. రూ.57 కోట్ల వ్యయంతో 28 భవనాల్లో 864 మందికి గృహ నిర్మాణాలు పూర్తవ్వగా గతంలో ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు గృహాలు కేటాయించారు. అప్పట్లో రూ.500, రూ.12,500, రూ.25,000, రూ.50,000 చొప్పున లబ్ధిదారులు చెల్లించే విధంగా గృహాల కేటాయింపులు చేపట్టారు. వీటిని ఇప్పటివరకూ లబ్ధిదారులకు అందజేయలేదు. ఈ గృహాలను 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో 274 గృహాలు, 365 చదరపు అడుగుల విస్తీర్ణంలో 286 ఇళ్లు, 430 చదరపు అడుగులు విస్తీర్ణంలో 304 గృహాలు నిర్మించారు. వీటిలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన గృహాలను ప్రభుత్వం రూ.1కే లబ్ధిదారులకు అందజేసినప్పటికీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి కాలేదు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించాలని టిడ్కో చైర్మన్ ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఇళ్లల్లో బ్యాంకు లింకేజీ పూర్తయిన వాటికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయగా 672 గృహాలకు బ్యాంకు లోన్లు ఇప్పించడానికి ఏర్పాట్లు చేస్తుండగా ఇప్పటి వరకు 600 పూర్తయాయి.

రుసుము లేకుండా రిజిస్ట్రేషన్లు

లబ్ధిదారుల నుంచి ఎటువంటి ఫీజు తీసుకోకుండా రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు మినహాయిస్తూ ప్రభుత్వం జీఓ నంబర్ 27, 28, 29 విడుదల చేసింది. ఒక్కసారిగా ఎక్కువ రిజిస్ట్రేషన్లు చేయడం కష్టసాధ్యం కనుక అనువైన రోజుల్లో రిజిస్ట్రేషన్లు చేసే విధంగా ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.

ఫ్లాట్ల పంపిణీకి ఏర్పాట్లు



ప్రభుత్వ ఆదేశాలతో పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని గోర్స రైల్వే గేటు సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే 700 గృహాలకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. మిగిలిన వాటికి బ్యాంకు లోన్లు ఇప్పించి, బ్యాంకు లింకేజీలు పూర్తి చేసి రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తాం. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని గృహాలకు తాగునీటి వసతి, కరెంట్ తదితర వసతులు కల్పించాం. విద్యుత్ కనెక్షన్లు ఇప్పటికే ఇవ్వాల్సి ఉండగా లబ్ధిదారుల పేరున ఇళ్లు రిజిస్టర్ కాకుండా కనెక్షన్ ఇవ్వడం సాధ్యం కాలేదు. అయినప్పటికీ వెంటనే కనెక్షన్లు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేశాం. ఈ నెలాఖరుకు లబ్ధిదారులకు గృహాలు పంపిణీ చేస్తాం.

– ఎం.రామ్మోహన్, కమిషనర్, పిఠాపురం మున్సిపాలిటీ

నేడు మండల పరిషత్తు సమావేశం

సామర్లకోట: స్థానిక మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ డి.శ్రీలలిత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత వహిస్తారన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు హాజరు కావాలన్నారు.

అన్నదానంలో సరకులకు టెండర్ల స్వీకరణ

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదానంలో పాలు, పెరుగు, కూరగాయలు సరఫరా చేయడానికి సీల్డ్ టెండర్లు స్వీకరిస్తున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మే ఒకటి నుంచి 31 వరకు ఈ సరకులు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. కూరగాయల విలువ సుమారు రూ.ఆరు లక్షలు, పాలు, పెరుగు విలువ రూ. ఐదు లక్షలు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ 11 గంటల లోపు టెండర్లు వేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలో నిర్వహించిన స్పందనకు ఆయా మండలాల నుంచి తొమ్మిది అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీఓ విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు గాను అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద స్పందన జరుగుతుందన్నారు. డీఎల్‌పీఓ బాలామణి, సహకార శాఖ నుంచి మసకపల్లి రంగనాయకులు, గృహ నిర్మాణ శాఖ నుంచి రవిశంకర్, ఏడీఏ దైవకుమార్, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్, ఎంఈఓ సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు


అమరవల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అమరవల్లిలో సర్పంచ్ పులి జయబాబు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ గొరిసే కాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని ప్రతి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక అనేక పథకాలు అందుకుంటున్నామని ప్రజలు చెబుతున్నారని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు అన్నారు. మండలంలోని గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు గృహసారథులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

రామన్నపాలెంలో బోట్ల ఎన్యుమరేషన్


బోట్ల ఎన్యుమరేషన్‌తో ఉప్పాడ-కోనపాపపేట బీచ్ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

కొత్తపల్లి: రామన్నపాలెంలోని ఉప్పుటేరు వద్ద సోమవారం మత్స్యకార బోట్లకు అధికారులు ఎన్యుమరేషన్ నిర్వహించారు. మత్స్యశాఖ అధికారి శ్రీరామకృష్ణ ఆధ్వర్యంలో బోట్లు ఉన్నవారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసా పొందాలంటే ఎన్యుమరేషన్ తప్పని సరి అన్నారు. మండలంలోని 1222 బోట్లకు సంబంధించి 7,330 మంది మత్స్యకారుల వివరాలను నమోదు చేయనున్నట్లు ఆయన తెలపారు.

స్తంభించిన ట్రాఫిక్

బోట్ల ఎన్యుమరేషన్ చేయించుకునేందుకు వందలాది మంది మత్స్యకారులు రావడంతో ఉప్పాడ-కోనపాపపేట బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. మత్స్యకారులు తమ వాహనాలను బీచ్‌రోడ్డులో నిలపడంతో గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కల్యాణ మండపాలు నిర్మించాలి

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో టీడీపీ హయాంలో మంజూరు చేసిన కాపు, బీసీ కల్యాణ మండపాలను వెంటనే నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ చేశారు. గొల్లప్రోలులో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కాపు కల్యాణ మండపానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. రూ.1.50 కోట్ల విలువైన స్థలాన్ని సైతం ఇచ్చామని, బీసీ కల్యాణ మండపానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేశామని తెలిపారు. వీటికి సంబంధించి నగర పంచాయతీలో తీర్మానాలు, నిర్మాణానికి శంకుస్థాపనలు సైతం చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకూ ఏ ఒక్కటి నిర్మించలేదని ఆయన విమర్శించారు. వెంటనే వాటిని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సామర్లకోట: మేడపాడు గ్రామంలోని 11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీని కారణంగా వేట్లపాలెం, మేడపాడు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. స్థానిక పిఠాపురం రోడ్డులోని సబ్ స్టేషన్‌లో పవర 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంట వరకూ విద్యుత్తు అంతరాయం కలుగుతుంది. ఉండూరు, గొంచాల, నవర, పవర, చంద్రంపాలెం, పి.వేమవరం గ్రామాలకు సరఫరా ఉండదు.

రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పాత ఇసుకపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం


పాత ఇసుకపల్లిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లిలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో 280 ఇళ్లను సందర్శించారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామంలో శివారు ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందటం లేదని, డ్రైన్లు, సీసీ రోడ్లు, వీధి లైట్లు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ పాలకులకు కేవలం ఎన్నికల ముందు మాత్రమే ప్రజలు గుర్తుకు వచ్చేవారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నిమిషం ప్రజలతోనే మమేకమై, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను మోసం చేసి, అవినీతి, అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు, లోకేష్ ప్రస్తుతం ప్రజా సమస్యలపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి రక్షిత తాగునీరు అందిస్తామని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఇసుకపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు యరకం నూకారెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ యరకం దివాకర్‌రెడ్డి, జి.వీరభద్రరావు, సన్నిబోయిన ఏలేషా తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసి.. అభిమానం చాటి

ఘనంగా దొరబాబు జన్మదిన వేడుకలు


సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు



పెద్దాపురంలో మాట్లాడుతున్న సామర్లకోట మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సుబ్బారావు

సామర్లకోట: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు జన్మదిన వేడుకలను సోమవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. స్థానికుడైన దొరబాబుకు పెద్దాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించడంతో పెద్ద ఎత్తున అభిమానులు కేక్ కట్ చేశారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో పోలింగ్ రింగ్ సెంటర్ వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్‌ల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బసివిరెడ్డి సత్రం వద్ద పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మద్దాల శ్రీను, అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అయ్యరక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, రెండో మున్సిపల్ వైస్ చైర్మన్ గోకిన సునేత్రదేవి, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, అధికార పార్టీకి చెందిన 29 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు. అలాగే స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. పెద్దాపురం తాహసీల్దార్ వజ్రపు జితేంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి గుడి వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సామర్లకోట మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు నియోజకవర్గ స్థాయి క్యాడర్‌తో కలసి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ తన కుమారుడిని ఎమ్మెల్యేగా చూడాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, నల్లల గోవిందు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, దూది రాజు, పాగా సురేష్, ఉబా జాన్‌మోజెస్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉంటే కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో దొరబాబు ఎమ్మెల్యేగా గెలుపొందాలని పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం కేక్ కట్ కోశారు. ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, గంటా రామస్వామి, పెచ్చెట్టి రాజు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన


పెద్దిపాలెంలో ప్రదర్శించిన 31 రకాల నవధాన్యాలు

ప్రత్తిపాడు రూరల్: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ఏపీసీఎన్ఎఫ్ ఎంటీ రామలక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 31 రకాల నవధాన్యలను ప్రదర్శించారు. అనంతరం రామలక్ష్మి మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమిలో జీవవైవిధ్యం ఏర్పడి పంటలకు కావలసిన పోషకాలు లభిస్తాయన్నారు. భూమిలో తేమ శాతం, కర్బన శాతం పెరిగి ఫలితంగా పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. రైతులు నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ ఐబీ ఎన్డీఏ ఎం మల్లేశ్వరి, ఏపీసీఎన్ఎఫ్ ఒమ్మంగి, రాచపల్లి, పెద్దిపాలెం యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు రాట ముహూర్తం


చిల్లంగిలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కిర్లంపూడి: చిల్లంగి శ్రీనివాసనగర్‌లో ఏలేరు నది ఒడ్డున వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పందిరిరాట వేశారు. మహిళలు పసుపు కొట్టారు. ఈ నెల 31వ స్వామి, అమ్మవార్లను పెళ్లికుమారుడు, పెండ్లి కుమార్తెను చేస్తారని, మే 1వ స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

లలితా సహస్రనామ పారాయణ

చిల్లంగి అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం లలితా సహస్ర నామ పారాయణ నిర్వహించారు.

80 మందికి కంటి పరీక్షలు

తుని రూరల్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం వృద్ధులకు ఓ వరమని తుని మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు అన్నారు. మండలంలోని కేఓ మల్లవరంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాన్ని మాజీ సర్పంచ్ ఏకా కన్నయ్య, డొంక వెంకట బెనర్జీతో కలసి ఆయన ప్రారంభించారు. డాక్టర్ లలిత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 80 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి మందులను అందజేశారు. వీరిలో ఐదుగురిని శస్త్ర చికిత్సలకు, 40 మందిని కళ్ల జోళ్లకు ఎంపిక చేసినట్టు డాక్టర్ లలిత తెలిపారు. సచివాలయ కార్యదర్శులు శివ, వీరబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు


కొత్తపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు స్టీల్ గ్లాసులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత మెరుగైన పౌష్టికాహారం అందించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాగిజావ తాగేందుకు అవసరమైన స్టీల్ గ్లాసుల పంపిణీని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని 1464 మంది విద్యార్థులకు స్టీల్ గ్లాసులు పంపిణీ చేస్తామన్నారు. ఫైబర్స్, మినరల్స్, అమైనో ఆమ్లాలు, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ బి అధికంగా ఉండే జావ తాగడం వలన విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఆలోచన శక్తి మరింత మెరుగుపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి తప్పకుండా రాగిజావ తాగాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, మండల వ్యవసాయ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, ఎంఈఓ వేణుగోపాల్, సర్పంచులు సక్కా మణికంఠబాబు, రావి రమేష్, పులి జయబాబు తదితరులు పాల్గొన్నారు.

దవులూరి సుబ్బారావుకు పాముకాటు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బారావు

సామర్లకోట: రాష్ట్ర మాజీ కార్మిక సంఘ అధ్యక్షుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తండ్రి దవులూరి సుబ్బారావు సోమవారం పాముకాటుకు గురయ్యారు. పిఠాపురం రోడ్డులో ఉన్న పొలంలోకి వెళ్లిన సమయంలో పాముకాటు వేసినట్లు చెబుతున్నారు. వెంటనే సుబ్బారావును స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి ఏడీబీ రోడ్డులోని ఓ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం పరిస్థితి మెరుగుపడినట్లు వైద్యులు తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న దవులూరి దొరబాబు తండ్రి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు సుబ్బారావును ఆసుపత్రిలో పరామర్శించారు.